
ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మెట్రో సాధన సమితి సభ్యులు

కొంపల్లి-మేడ్చల్ మార్గంలో మెట్రో పనులు చేపట్టాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి, మేడ్చల్ వరకు మెట్రో మార్గాన్ని విస్తరించాలని అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆయన కార్యాలయంలో మేడ్చల్ మెట్రోసాధన సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఆదివారం అందజేశారు. మేడ్చల్ జిల్లా పరిసర ప్రాంతాల్లోని అల్వాల్, కొంపల్లి, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో సుమారు 60 వేల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులు ఈ మార్గం గుండా నిత్యం ప్రయాణం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి రెండో దశలోనే ఈ మార్గంలో మెట్రోపనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జార్జి శ్రీనివాస్‌రెడ్డి, మనీష్, సురేష్, రమేష్, పుప్పాల భాస్కర్‌లు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులుగా ఉండాలి

కుత్బుల్లాపూర్: కాలనీ సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులుగా ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా మహేష్, ఖలీల్‌ను ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, కోశాధికారి జె.రాజేష్, సలహాదారులు ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సురేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా కుమారి



కుమారిని అభినందిస్తున్న జిల్లా నాయకులు

జీడిమెట్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా ఆదర్శనగర్ నివాసి కట్టాకుమారి నియమితులయ్యారు. హెచ్ఎంటీ కాలనీలోని మ్యాక్స్‌విజన్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా లయన్స్‌క్లబ్ లియోన్ పీసీ ఓబుల్‌రెడ్డి, లియోన్ జి.వి.రమణారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కుమారిని ఎన్నుకున్నారు. కె.జయరాం, డి.సత్యనారాయణ, రామచందర్‌నాయుడు, విశాల్ పాల్గొన్నారు.

ఆలయానికి మాజీ సర్పంచ్ విరాళం


ఆలయకమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కావలి గణేష్

దుండిగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ తాండ-1లో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ సహిత దుర్గామైసమ్మ దేవతా ఆలయానికి సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు, దుండిగల్ మాజీ అధ్యక్షుడు కావలి గణేష్ రూ.50,116 రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు.కార్యక్రమంలో దొంతి మహేష్‌ముదిరాజ్, సిరగల్ల బాబు, ఆలయకమిటీ సభ్యులు వెంకటేష్‌నాయక్, భీమ్‌సింగ్ నాయక్ ఉన్నారు.

డివిజన్‌లో బీజేపీ కార్పొరేటర్ పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

పేట్ బషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని బృందావనంకాలనీ, ఎంఎన్ రెడ్డి నగర్‌లో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. అనంతరం ఎంఎన్‌రెడ్డి నగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును తారా చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి, అశోక్‌గౌడ్, ఉష, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఝాన్సీ, చక్రి, నాగేశ్వరావు, విశ్వరూపచారి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని చెన్నారెడ్డినగర్‌లో నిర్వహిస్తున్న అభయాంజనేయస్వామి మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. శ్రీనివాస్, రమణారెడ్డి, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● వీరాంజనేయస్వామి ఆలయంలో..

రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లో వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కెఎం.ప్రతాప్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు హరిబాబు, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, శంకర్, దాసు, బాబూమియా, సాయికిరణ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అందరూ సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలి

హైదర్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవచేయడంలో రాందేవ్ ఆస్పత్రి ముందుంటుందని డాక్టర్ ఛాయాదేవి అన్నారు. కూకట్‌పల్లిలోని రాందేవ్ ఆస్పత్రిలో ఆదివారం ఫ్రీ వ్యాక్సినేషన్ ప్రారంభించి ఏడాది పూర్తైన సందర్భంగా అవగాన్ రన్, వాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. ఆస్పత్రి అబ్సిక్ అండ్ గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ సర్వైకల్ కేన్సర్‌పట్ల ఆస్పత్రి అధ్వ ర్యంలో గత సంవత్సరం నుంచి 2,500 మంది వాక్సినేషన్ చేసినట్లు తెలిపారు. 9 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఫ్రీ వ్యాక్సినేషన్ ఇచ్చామన్నారు. ప్రతీ ఒక్కరూ సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలని తెలిపారు. దీనిపై పెద్దఎత్తున సమాజంలోకి తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్న రాందేవ్ హాస్పటల్ యాజమానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, వైద్యులు లోకేషరెడ్డి, ఆదిత్య, ప్రమోదిని, పావని, మంజుల, సుధారాణి, సుప్రియ, మంజుల, ప్రిన్సీ, శృతి, అక్షిత, అనురాధతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీడిమెట్లలో యువకుడి కిడ్నాప్, హత్యాయత్నం


గాయపడిన రాహుల్

జీడిమెట్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో ఓ యువకుడిని కిడ్నాప్ చేసి హత్యకు యత్నించిన ఏడుగురు వ్యక్తులపై జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం. రొడామిస్త్రీనగర్ ప్రాంతంలోని నెహ్రూనగర్‌కు చెందిన రాథోడ్ రాహుల్(22) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అదే బస్తీకి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయి కుటుంబ సభ్యులు గతంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసునమోదు చేయించారు. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి అనిల్, కవిత, శంకర్, షాజీ, లడ్డు, అశోక్, నరేష్ కలిసి రాహుల్‌ను కిడ్నాప్ చేసి కారులో నర్సాపూర్ అడవులకు తీసుకెళ్లారు. అతడిపై కర్రలు, రాడ్లతో దాడిచేసి కత్తితో హత్యచేయడానికి యత్నించారు. వీరిలో కొందరు అడ్డుకోవడంతో బతికి బయటపడ్డాడు. చివరికి కిడ్నాపర్లు వదిలేయడంతో ఇంటికి చేరుకున్న రాహుల్ కుటుంబసభ్యుల సాయంతో జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్పీజీతో ఇస్త్రీ చేద్దామా?

సమయం, ఖర్చు ఆదా చేయనున్న సరికొత్త ఐరన్ బాక్స్



- బొగ్గుతో శ్రమపడే కార్మికులకు ఊరట
- ఆదాయం పెరుగుదలకు దోహదం
- ఇతర రాష్ట్రాల్లో పెరిగిన వాడకం
- నగరవాసులకు పరిచయం చేసేందుకు రోటరీ క్లబ్ కృషి


ఎల్పీజీ బాక్స్‌తో ఇస్త్రీ చేస్తున్న కార్మికుడు

ఎర్రగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బొగ్గును మండించి.. ఇస్త్రీపెట్టె వేడెక్కే వరకూ వేచి ఉండి, ఇస్త్రీ చేయాలంటే కార్మికులకు శ్రమతో పాటు, సమయం కూడా వృథా అవుతుంది. బొగ్గుతో వచ్చే పొగతో అనారోగ్యానికీ ఆస్కారం ఉంది. వీటికి చెక్ పెడుతూ ఎల్పీజీ ఇస్త్రీపెట్టెలు వాడుకలోకి వస్తున్నాయి. బొగ్గు ఇస్త్రీపెట్టెలో బొగ్గు మండించి వేడెక్కడానికి దాదాపు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఎల్పీజీలో కేవలం రెండు నిమిషాలకే ఐరన్ బాక్స్ వేడెక్కుతుంది. బొగ్గు ఖరీదు కన్నా ఎల్పీజీ ఖర్చే తక్కువ. దీంతో కార్మికుల ఆదాయం కూడా పెరుగుతుంది. బొగ్గు పొగ వల్ల కార్మికులకు కలిగే దుష్పరిణామాలూ ఉత్పన్నం కావు. బొగ్గుతో ఇస్త్రీ చేసే కార్మికులకు ఉపశమనంగా ఎల్పీజీ ఐరన్ బాక్స్‌లను పరిచయం చేయడానికి రోటరీ క్లబ్ కృషి చేస్తోంది. ఎల్పీజీ ఐరన్ బాక్స్‌తో గల లాభాలను కార్మికులను తెలియజేస్తోంది.

ఎన్నో లాభాలు

బొగ్గుల ఇస్త్రీపెట్టె బరువు సుమారు 10.5 కేజీలు ఉంటుంది. కానీ ఎల్పీజీ బాక్స్ 6.5 కేజీలు మాత్రమే. అధిక బరువు ఉండే బొగ్గు ఇస్త్రీపెట్టె వల్ల కార్మికులు చేతి కండరాలు, కీళ్లనొప్పులతో బాధపడతారు. బొగ్గులపెట్టె కిలో బొగ్గుతో ఆరు గంటలు పనిచేస్తే, కిలో ఎల్పీజీతో ఈ ఐరన్ బాక్స్ మూడు రోజుల వరకు పని చేస్తుంది. రోజుకు 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ ఐరన్‌బాక్స్‌తో ఇస్త్రీ చేస్తే నెలకు సుమారు రూ. 8,000 నుంచి 10,000 వరకు బిల్లు వస్తుంది. కరెంటు బాక్స్‌తో ఒక ప్యాంటు ఇస్త్రీకి మూడు రూపాయలు ఖర్చు రాగా, బొగ్గుల బాక్స్‌తో రూ.1.35 అవుతుంది. ఎల్పీజీతో కేవలం 55 పైసలు మాత్రమే ఖర్చవుతుందని నిపుణులు చెబుతున్నారు. బొగ్గుల ఇస్త్రీపెట్టెతో నెలకు రూ.2,500 ఖర్చు వస్తే, ఎల్పీజీకి కేవలం రూ. 800 మాత్రమే ఖర్చు అవుతుంది. దీంతో కార్మికుడికి సుమారు రూ.1,700 లాభం ఉంటుంది. ఒక్కసారి బొగ్గును మండిస్తే, పని ఉన్నా లేకపోయినా అది కాలిపోతూ ఇంధనం వృథా అవుతుంది. కానీ, గ్యాస్ స్టౌను ఆఫ్ చేసినట్లు ఎల్పీజీని కూడా ఆఫ్ చేసుకోవచ్చు. బొగ్గుల పెట్టె ద్వారా ఉత్పన్నమయ్యే కార్బన్ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి. ఎల్పీజీతో కార్బన్ చాలా తక్కువగా విడుదలవుతుంది. కాబట్టి అలాంటి సమస్యలు ఉండవు.

కేవలం రెండు నిమిషాల్లో వేడెక్కుతుంది



బొగ్గుతో ఇస్త్రీపెట్టె వేడెక్కాలంటే రెండు గంటలు వేచి ఉండే వాళ్ళం. ఎల్పీజీ ఐరన్ బాక్స్ కేవలం రెండు నిమిషాల్లోనే వేడెక్కుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.

\- ధర్మ, పాండురంగ నగర్

ఎల్పీజీ బాక్స్‌లను వాడుకలోకి తేవడానికి కృషి



బొగ్గు ఇస్త్రీపెట్టెతో కష్టాలు పడుతున్న కార్మికులకు ఊరటగా ఎల్పీజీ ఐరన్ బాక్సులను వాడుకలోకి తేవడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే చాలా మంది కార్మికులకు ఈ ఐరన్ బాక్స్‌లను అందజేశాం. మహిళా ఇస్త్రీ కార్మికులు 50 మంది కలిసి ముందుకు వస్తే వారికి సబ్సిడీ ద్వారా అందజేస్తాం. వివరాలకు 7729070809 నంబర్(రోటరీ క్లబ్, హైదరాబాద్)ను సంప్రదించవచ్చు.

\- ఏ మోహన వంశీ, రోటరీ క్లబ్, జిల్లా అసిస్టెంట్ గవర్నర్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన రూ.80 వేల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్పవరమన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



మాదాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సిద్ధేంద్ర కళాపీఠం, నాట్యగురువు డాక్టర్ రుద్రవరం సుధాకర్ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శన ఆద్యంతం సందడి సందడిగా సాగింది. గణనాయకమ్, చేరి యశోదకు, జయదేవుని అష్టపది, మధురమధుర తదితర అంశాలపై చక్కటి అభినయంతో కళాకారుల నృత్య ప్రదర్శన అలరించింది.

హెచ్‌ఏఎల్‌లో యూనియన్ ఎన్నికల హడావిడి

● నేడు నామినేషన్ల స్వీకరణ ● ఏర్పాట్లు పూర్తి



బాలానగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హిందుస్తాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)లో ఈనెల 30న జరగాల్సిన కార్మిక యూనియన్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 12 (సోమవారం) ఎన్నికల నామినేషన్లు వేసేందుకు నాయకులు సిద్ధమయ్యారు. ఆగస్టు 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. సంస్థలో 892 మంది కార్మికులు బ్యాలెట్ పేపర్ ద్వారా, 56 మంది కార్మికులు (35 మంది కేరళ కాసరగడ్, 21 మంది ఔట్ స్టేషన్ సిబ్బంది) పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సంస్థలో మొత్తం 6 కార్మిక యూనియన్లు ఉండగా ఇందులో కొన్ని యూనియన్లు మరో యూనియన్‌తో పొత్తు పెట్టుకుని గెలుపు కోసం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. హెచ్ఏడబ్ల్యూ, ఈటీయూ, ఐఈయూ యూనియన్లు కూటమిగా ఉండగా బీఎంఎస్, టీఆర్ఎస్ కార్మిక సంఘాలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఐఎన్‌టీయూసీ ఏ యూనియన్‌తో పొత్తు పెట్టుకుంటుందో ఇంకా తేలాల్సి ఉంది. గత ఎన్నికల్లో హెచ్‌డబ్ల్యూ, ఈటీయూ, ఐఎన్‌టీయూసి కలిసి పోటీ చేస్తే 335 ఓట్లు వచ్చాయి. బీఎంఎస్ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ కలిసి పోటీ చేయగా 27 ఓట్ల మెజారిటీతో బీఎంఎస్ ఘన విజయం సాధించి బీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడిగా జానకీరామ్, జనరల్ సెక్రటరీ వెంగళ్‌రావు యూనియన్ బాధ్యతలు చేపట్టారు. అభ్యర్థుల బలా బలాలపై కార్మిక సంఘాల నేతల్లో చర్చ మొదలైంది.

చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి


దశరథ్(ఫైల్)

రాయదుర్గం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి వలలో కాలు చిక్కుకోవడంతో చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. కర్ణాటక గుల్‌బర్గకు చెందిన బహంత్రి దశరథ్(35) కుటుంబంతో కలిసి కొంతకాలం క్రితం నగరానికి వచ్చి గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు దశరథ్ చేపలుపట్టేందుకు మధ్యాహ్నం 1.30 గంటలకు పక్కనే ఉన్న చెరువుకి వెళ్లాడు. వల విసురుతుండగా అది కాలు చిక్కుకుని నీళ్లలో పడిపోయాడు. కాలు నుంచి వల తీసే ప్రయత్నంలో దశరథ్ చెరువులో కొట్టుకుపోతున్నాడు. స్థానికులు చూసి కాపాడే ప్రయత్నం చేసేలోపే నీళ్లలో మునిగి మృతి చెందాడు. స్థానికులు మృతుడి భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. గచ్చిబౌలి ఎన్టీఆర్‌నగర్‌లోని చెరువులోని మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

బోరబండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ సైట్-3కి చెందిన మహ్మద్ ఫర్హీన్‌ఖాన్(24) సోఫాలు తయారు చేస్తాడు. ఆదివారం ఇతడిపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి గొంతు కోశారు. చనిపోయాడని భావించి నిమ్స్‌మే మైదానంలో వదిలేసి పరారయ్యారు. ఇదే సమయంలో కార్మికనగర్ నిమ్స్‌మే మైదానం పక్కన ఉండే వ్యక్తి మైదానంలోకి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఫర్హీన్‌ఖాన్‌ను చూసి 100కు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరిన బోరబండ పోలీసులు బాధితుడు బతికే ఉన్నాడని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని గాంధీకి తరలించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని పోలీసులు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

గచ్చిబౌలి హాకీ స్టేడియంలో సంబరాలు

రాయదుర్గం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్స్‌లో హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంతో హాకీ క్రీడాకారుల్లో రెట్టింపు ఉత్సాహం నింపిందని హాకీ రాష్ట్ర అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జూనియర్ జాతీయ టీం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిబిరానికి ఎంపికైన టీంతో పాటు తెలంగాణ హాకీ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇండియా హాకీ జట్టు ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. పంజాబ్ జలంధర్‌లో వచ్చే నెల 9 నుంచి 18 వరకు హాకీ జాతీయ పోటీలు కొనసాగనున్నట్లు కార్యదర్శి భీంసింఘ్ తెలిపారు. కార్యక్రమంలో హాకీ తెలంగాణ సభ్యులు సురేందర్‌సింగ్, హైదరాబాద్ ట్రెజరర్ వేణుగోపాల్, సెలక్షన్ కమిటీ సభ్యులు హాస్సెన్‌బీన్ మహ్మద్, సింగదాసరి రాజశేఖర్, కోచ్ పెంచాల్, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న క్రీడాకారులు


చంద్రబాబుతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఏపీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

హైదర్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడును కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జూబ్లీహిల్స్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారి దర్శనాలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బైకు దొంగల అరెస్టు - 14 వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీస్ అధికారులు

అల్లాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్‌తో పాటు గచ్చిబౌలి, చందానగర్, కేపీహెచ్‌బీ, ఫిలింనగర్, బాచుపల్లి, మియాపూర్, మాదాపూర్ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను తస్కరించిన నలుగురు బైకు దొంగలను పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. అల్లాపూర్ సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు.. 1న తన ఇంటిముందు పార్క్ చేసిన తన బైకు చోరీకి గురైందన్న ఫిర్యాదు అందిందని, విచారణలో భాగంగా శనివారం గాయత్రి నగర్ క్రాస్ రోడ్‌లో చెకింగ్ నిర్వహించారు. రెండు బైకులమీద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించటంతో వారిని ఆరాతీసి వాహనాల డాక్యుమెంట్లను చూపించమని అడిగితే పారిపోయేందుకు యత్నించారు. ఆ నలుగురు వ్యక్తులను బైకులతో సహా పీఎస్‌కు తీసుకొచ్చి విచారించగా అల్లాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొత్తం 14 ద్విచక్ర వాహనాలను దొంగిలించారని తేలింది. నానక్‌రాం గూడకు చెందిన చప్పిడి గణేష్(21), బాచుపల్లికి చెందిన గుబాల పవన్ కుమార్, మోతినగర్‌కు చెందిన గుబాల శ్రీరాం(20)లతో పాటు ఒక బాలుడిని నిందితులగా నమోదుచేసి కేసు కట్టారు. నిందితులంతా చిన్న నాటి స్నేహితులని, జల్సాలకు అలవాటు పడ్డ వీరు రాత్రిళ్ల సంచరిస్తూ ఇళ్ల ముందు, రోడ్ల మీద పార్క్ చేసి ఉంచిన వాహనాలను దొంగిలించి అదను చూసి విక్రయిస్తారని పోలీసలు తెలిపారు. తెగువ, చాకచక్యంతో దొంగల గుట్టు రట్టు చేసిన అల్లాపూర్ పోలీసుల బృందాన్ని బాలనగర్ జోన్ డీసీపి కె. సురేష్ కుమర్, కూకట్‌పల్లి డివిజన్ ఏసిపి శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించారు.

భవానికి మిస్సెస్ హ్యూమానిటీస్ అవార్డు


అవార్డును గెలుచుకున్న భవాని

రాయదుర్గం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మిసెస్ హ్యూమానిటీస్ అవార్డును గెలుచుకున్న హైదరాబాద్ మహిళ భవానిజి. ఢిల్లీలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకూ నిర్వహించిన మిసెస్ ఇండియా క్యూన్ ఆఫ్ సబ్‌స్టేన్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అందం, టాలెంట్, ఇంటలిజెన్స్, కంప్యాషన్ అనే నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించగా మిసెస్ ఇండియా హ్యూమానిటీస్-2024కు భవాని ఎంపికయ్యారు. ఇందుకోసం నిర్వాహకులు 30 ఫైనలిస్టులతో పోటీపడగా వారిలో భవాని ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమె చేసిన సామాజిక కార్యక్రమాలు గుర్తించిన నిర్వాహకులు ఆమెను మిసెస్ హ్యూమానిటీస్-2024కు ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆమె నగరంలోని గచ్చిబౌలిలోని మైహోం విహంగ్‌లో ఉంటూ ఓ మల్టీనేషనల్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తోంది.

బౌరంపేట్, బాచుపల్లిలో ఘనంగా బోనాలు


గోపినగర్‌లో బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

దుండిగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్, నిజాంపేట్ కార్పొరేషలోని బాచుపల్లి గ్రామాలలో ఆదివారం శ్రావణమాసం బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈబోనాల వేడుకకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరావు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ హాజరయ్యారు. వేడుకల్లో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సత్తిరెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ సర్గారి రంగారెడ్డి, స్థానిక గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. బాచుపల్లి బోనాల వేడుకల్లో డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, కార్పొరేటర్ జగన్, మంత్రి సత్యన్నారాయణ, కాసాని సుధాకర్ పాల్గొన్నారు.

● శేరిలింగంపల్లిలో..

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం మదీనగూడ, గోపీనగర్, బాపూనగర్‌కాలనీలో శ్రావణమాస బోనాల ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లేష్, చంద్రమౌళి, గుణశేఖర్, రమేష్, శివసాయి, సుధాకర్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతాల్లో ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వారాంతాల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 212 మంది మందుబాబులు తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరిలో 165 మంది ద్విచక్రవాహనదారులు, 10 మంది ఆటోడ్రైవర్లు, 24 మంది కారు డ్రైర్లు ఉన్నారు. ముగ్గురు భారీ వాహనాలను నడుపుతున్నవారు ఉన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో 21 మందికి 200 నుంచి 550 వరకు బీఏసీ కౌంట్ వచ్చింది.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

చందానగర్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కుంకుమార్చన కార్యక్రమం కొనసాగింది. అమ్మవారిని లక్ష్మీఅవతారంలో అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి మహిళలు అధికసంఖ్యలో వచ్చి కోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్నారు.